## క్లుప్తంగా

### తాగునీటి ఎద్దడి నివారణకు కృషి



బోరుబావి తవ్వకం ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తనవంతు కృషి చేస్తానని జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పాంబండ గ్రామంలో నీటి ఎద్దడి నెలకొన్న విషయం గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా తన సొంత నిధులతో బోరుబావి తవ్వకం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా తన సొంత నిధులతో 50 బోరుబావులు తవ్వించి తాగునీటి సమస్య పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లేశ్, ఆంజనేయులు, యాదగిరి, వీరేశం ఉన్నారు.

### తునికి నల్లపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి



పోచమ్మ తల్లిని దర్శించుకొంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలం తునికి నల్లపోచమ్మదేవి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. డప్పు చప్పుడు, శివసత్తుల పూనకాలతో ఆదివారం వివిధ జిల్లాల నుండి వచ్చిన భక్తులతో సందడిగా మారింది. ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలుతీసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీ నెలకొంది. ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి తదితరులు అన్ని ఏర్పాట్లు చేశారు.

### 20న చలో సెక్రటేరియట్

పెద్దశంకరంపేట(మెదక్): రాష్ట్రంలో ధూపదీప నైవేద్య పథకంలో పనిచేస్తున్న అర్చకుల వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న చలో సెక్రటేరియట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షుడు గుడి చంద్రశేఖర శర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని అర్చకులందరూ మంగళవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌కు తరలివచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేయాలని పిలుపునిచ్చారు. అర్చకులకు ఉద్యోగ భద్రత, పాత వారికి వేతనాలు, కొత్తగా ఈ పథకంలో చేరిన అర్చకులకు 7నెలలుగా వేతనాలు రాక పోవడం వంటి సమస్యలపై ముఖ్యమంత్రికి విన్నవించనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అర్చకులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### హల్దీవాగులోకి నీటి విడుదలపై హర్షం

వెల్దుర్తి(తూప్రాన్): కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీవాగులోకి సాగునీటి విడుదలపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు నర్సింలు మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు మండలాల రైతులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే సునీతారెడ్డి అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించారన్నారు. దీనితో 0.3టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాయడంతో ప్రభుత్వం వెంటనే నీటిని విడుదల చేసిందన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొండపోచమ్మ నుంచి విడుదల చేసిన నీటితో మండలంలోని హల్దీప్రాజెక్ట్, హల్దీవాగుపై నిర్మించిన చెక్ డ్యాంలు జలకళను సంతరించుకుంటాయన్నారు.

### ఆర్థిక సహాయం అందజేత



పోచయ్యకు ఆర్థిక సహాయం అందిస్తున్న రాజేందర్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): అనారోగ్యానికి గురై వైద్య చికిత్స చేయించుకోలేని స్థితిలో ఉన్న వారికి బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు ఎల్లయ్యగారి రాజేందర్‌రెడ్డి ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. చిలప్‌చెడ్ మండలం శీలాంపల్లి గ్రామానికి చెందిన చౌటకూరి పోచయ్య, ఎరుకలి వెంకటేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి బాధపడుతున్నారు. వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉండడంతో పోచయ్యకు రూ.15 వేలు, వెంకటేశ్‌కు రూ. 10 వేలు రాజేందర్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో భగవంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్, శేఖర్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎండీఏ పరిధిలో | కెమికల్ పరిశ్రమలు వద్దు

అనుమతించొద్దంటూ గ్రామస్తుల నిరసన




పంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామ శివారులో కొత్తగా కెమికల్ పరిశ్రమ ఏర్పాటుకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దానికి అనుమతులు రద్దు చేయాలని గ్రామస్తులు శుక్రవారం జిల్లా కలెక్టర్‌తో పాటు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కెమికల్ పరిశ్రమ ఏర్పాటు వల్ల సమీపంలో ఉన్న ఉసిరికపల్లితోపాటు కొట్టాల, ఏదుల్లాపూర్, గిరిజన తండాల ప్రజల జీవనోపాధి మీద తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వాపోయారు. బోరుబావులు, భూగర్భ జలాలు, చెరువులు, కుంటల నీరు కలుషితమైయ్యే అవకాశం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో నవాబుపేట, శభాష్‌పల్లి, బిజ్లీపూర్, పెద్దగొట్టిముక్ల గ్రామాల్లో రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేశారని, కాని ప్రజల అభిప్రాయం మేరకు ఏర్పాటు జరిగేదన్నారు. నేడు ప్రజాభిప్రాయం తెలుసుకునే అవకాశం లేకుండా పోయిందని వాపోయారు. పొల్యూషన్ వచ్చే పరిశ్రమలకు సంబంధించి ప్రత్యేక జోన్ విభజించి ఆ ప్రాంతంలో ఇలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.

**ప్రజల జీవనంపై ప్రభావం..**



గ్రామ పరిధిలో కొత్తగా కెమికల్ పరిశ్రమ ఏర్పాటు వల్ల ప్రజల జీవనంపై ప్రభావం పడుతుంది. భూగర్భ జలాలు, చెరువు నీరు కలుషితం అవుతుంది. హెచ్‌ఎండీఏ పరిధిలో పొల్యూషన్ వెదజల్లే కెమికల్ పరిశ్రమలు ఏర్పాటు చెయ్యొద్దు.

– కృష్ణారావు, గ్రామస్తుడు

**సాగుకు కష్టమైతది..**



వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్నాం. వాయు కాలుష్యం వల్ల సాగు చేసుకునే పరిస్థితి ఉండదు. రైతులకు నష్టాన్ని చేకూర్చే పరిశ్రమలు నిర్మించకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

– భిక్షపతిచారి, రైతు



శివ్వంపేట(నర్సాపూర్): క్యూలైన్‌లో భక్తులు

# వైభవంగా బ్రహ్మోత్సవాలు



కౌడిపల్లి(నర్సాపూర్): దేవతామూర్తుల పల్లకీసేవ

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిఏటా మూడు నెలల పాటు ప్రతి ఆదివారం జాతర మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆదివారం జాతరకు ఉమ్మడి జిల్లా నుండే కాకుండా హైదరాబాదు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకుని వంటావార్పు చేపట్టారు. పవిత్ర కోనేరులో స్నానమాచరించి గుట్టపై కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని కాలినడక వెళ్లి దర్శించుకున్నారు. స్వామివారికి పూజారులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది.

**ఘనంగా మల్లన్న జాతర**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో శ్రీమల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు గోకుల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం గ్రామంలో ఒగ్గుపూజారులు, గోకుల్ యాదవం సంఘం సభ్యులు గ్రామంలో భిక్షాటన చేయడంతోపాటు గంగ స్నానానికి వెళ్లారు. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. పోతురాజులు విన్యాసాలు, డోలు చప్పుళ్లతో గ్రామ దేవతలకు స్థానిక పెద్దచెరువు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఘనంగా తిరుమలనాథ బ్రహ్మోత్సవాలు



పుష్కరణిలో స్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

నిజాంపేట(మెదక్): అంగరంగ వైభవంగా జరిగిన శ్రీతిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజున స్వామివారి విగ్రహాలకు శతగటాభిషేకం, చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో పురోహితులు సంతోష్ శర్మ, ముత్యం రెడ్డి, ఆలయ చైర్మన్ అక్కపల్లి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఆలయ పాలకవర్గ సభ్యులు బాజ రామచంద్రం, తుమ్మల రమేశ్, కాకి రాజయ్య, రాజిరెడ్డి, ఎల్లా గౌడ్, శ్యామరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మల్కాపూర్ గ్రామస్తుల శ్రమదానం



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో గ్రామస్తులు

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ఆదివారం 401వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆరో వార్డులోని పంచాయతీ పరిసర ప్రాంతాలలో నిర్వహించారు. సీసీ రోడ్డుపై ఉన్న చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్‌ను చీపుర్లతో ఊడ్చి శుభ్రపరిచారు. ప్రతి ఆదివారం గ్రామంలో రెండు గంటల పాటు శ్రమదానం చేసి పరిశుభ్ర గ్రామంగా ఉంచాలని మాజీ ఉపసర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సురేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు, మేకిన్ యువత, సిబ్బంది పాల్గొన్నారు.

## పంట రక్షణకు పాట్లు



వరి పంటకు మందు కొడుతున్న రైతు

బియ్యం కొనితెచ్చి కడుపునింపుకుంటాం.. కాని ఆ బియ్యం మనింటికి చేరడం వెనుక ఎంతో మంది కష్టం ఉంటుంది. ముఖ్యంగా రైతులు రాత్రనక పగలనక శ్రమిస్తారు. గింజ నాటింది మొదలు పంట చేతికొచ్చే వరకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాలి. చీడపీడలు, పక్షుల బారినుంచి పంటను రక్షించుకోడానికి రైతు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. ఎన్నో చీడపీడల నుంచి కాపాడుకుంటున్నారు.

– కొల్చారం(నర్సాపూర్)

## సమాజానికి బాలసాహిత్యం అవసరం

సాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం



బాలసాహిత్య పుస్తకాలను ఆవిష్కరిస్తున్న బాలసాహిత్య కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రస్తుత సమాజానికి బాలసాహిత్యం ఎంతో అవసరమని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం అన్నారు. మన బాలసాహిత్యం కార్యక్రమం ఆదివారం సిద్దిపేటలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాజేశం మాట్లాడుతూ గతంలో చందమామ, బాలమిత్ర, బుజ్జాయిలాంటి మాసపత్రికల ద్వారా నీతి కథలు సమాజానికి చేరేవన్నారు. ప్రస్తుతం అలాంటి పత్రికలు కనుమరుగైనా పత్రికల్లో పిల్లల శీర్షికలతో కథలు గేయాలు, బొమ్మల రూపంలో అందుతున్నాయన్నారు. సామాజిక మాధ్యమాలలోనూ బాలసాహిత్యం విరివిగా రావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి పాఠశాల విద్యార్థులు రాస్తున్న బాలసాహిత్య రచనలకు పలు అవార్డులు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా బాలసాహిత్యం కోసం అహర్నిశలు పాటుపడుతున్న సిద్దిపేట జిల్లా బాలసాహిత్య రచయితల కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బాలసాహిత్య రచయితలు బస్వ రాజ్‌కుమార్, కోణం పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణతోనే అసమానతలకు అడ్డుకట్ట

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ

గజ్వేల్: దళితుల మధ్య పేరుకుపోయిన సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానతలు తొలగిపోవాలంటే ఎస్సీల ఏ,బీ,సీ,డీ వర్గీకరణే శరణ్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు మైస రాములు మాదిగ అన్నారు. ఆదివారం ప్రజ్ఞాపూర్‌లో ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల కమిటీ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్గీకరణ సాధనకు రాజీలేని పోరాటం సాగుతున్నదన్నారు. ఈ పోరాటంలో గ్రామ స్థాయి నుంచి మాదిగలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**కమిటీ ఎన్నిక**

ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల కమిటీ అధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, ఉపాధ్యక్షుడిగా స్వామి, కోశాధికారి ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా నవీన్, ప్రచార కార్యదర్శిగా కరుణాకర్ ఎన్నికయ్యారు.

# కోతులను తప్పించబోయి..

- బైక్ ప్రమాదం
- గాయపడిన కుటుంబ సభ్యులు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన కూతుళ్లతో తండ్రి జ్ఞానేశ్వర్

వెల్దుర్తి(తూప్రాన్): రహదారిపై కోతులు అడ్డురావడంతో బైక్‌పై నుంచి కిందపడి కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం మాసాయిపేట మండల పరిధిలోని బంగారమ్మ దేవాలయం వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం పిట్లం గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్, సవిత దంపతులు బతుకు తెరువు కోసం మేడ్చల్ జిల్లాకు వెళ్లారు. ఆదివారం స్వగ్రామం పిట్లంకు బైక్‌పై బయలు దేరారు. వారు మాసాయిపేట మండల కేంద్రం సమీపంలోని బంగారమ్మ దేవాలయం సమీపంలోకి చేరుకోగానే రహదారిపై కోతులు అడ్డంగా వచ్చాయి. వాటిని తప్పించబోయి బైక్ అదుపు తప్పికింద పడింది. దీంతో భార్య సరిత, ముగ్గురు కూతుళ్లు భాను ప్రియ, మూడేళ్ల సాయిశృతి, 8 నెలల చిన్నారి చందన తీవ్రంగా గాయపడ్డారు. వారికి తూప్రాన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు.

## కరాటేలో విద్యార్థుల సత్తా



బంగారు పతకాలను పొందిన విద్యార్థులు

జోగిపేట(అందోల్): మండలకేంద్రానికి చెందిన బైండ్ల జ్యోత్స్న, ఎండీ జమాల్‌లు కరాటేలో బంగారు పతకాలు సాధించినట్లు మాస్టర్ అశోక్ తెలిపారు. రుద్రమదేవి షోటోకాన్ కరాటే దో–సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్.. విజయభాస్కరరెడ్డి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన నాల్గో నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్–2024 పోటీల్లో 50 మంది పాల్గొన్నారని, 10 మంది బంగారు పతకాలు, 10 మంది సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. అందులో వీరిద్దరూ బంగారు పతకాలు సాధించారన్నారు.

## యూత్ స్వచ్ఛ భారత్



నర్సరీలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న యువకులు

మండలంలోని జీడిపల్లి గ్రామంలో యూత్ సభ్యులు ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీడిపల్లి నర్సరీలో పొదలను తొలగించి మొక్కలకు నీరుపెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ యూత్ సభ్యులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– మనోహరబాద్(తూప్రాన్)

## సంక్షిప్త వార్తలు

**◆ ఆలయానికి వంట పాత్రల వితరణ**



కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అన్నా, వదిన, కూతురి జ్ఞాపకార్థం స్థానిక శ్రీమల్లికార్జునస్వామి ఆలయానికి రూ.45వేల విలువగల వంటపాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని కంచన్‌పల్లి గ్రామానికి చెందిన దుంపల మల్లేశం, అతడి భార్య స్వరూప, కూతురు శ్రీలేఖ జూన్ 5న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో వాళ్ల జ్ఞాపకార్థం అతడి తమ్ముడు పరమేశ్ మల్లికార్జునస్వామి ఆలయానికి వాటిని వితరణ చేశారు.

**◆ ఉపకులాల సమస్యలు పరిష్కరించాలి**

నర్సాపూర్: ఎస్సీ ఉప కులాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర హోలియ దాసరి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు యాదగిరి కోరారు. కుల గణనచేసి ఎస్సీ ఉపకులాల సమస్యలను పరిష్కరించాలని, కుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ జారీచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేసి ఉప కులాలను ఏ వర్గంలో చేర్చి జనాభా దామాషా ప్రకారం 7శాతం రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు.

**◆ నేడు కౌడిపల్లిలో ఉచిత వైద్యశిబిరం**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో పంచాయతీ కార్యాలయం వద్ద 19న సంగారెడ్డి ఎంఎన్ఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పీఆర్‌ఓ బేతయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**◆ మద్యం దుకాణంలో తనిఖీలు**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగిలోని మద్యం దుకాణంలో ఆదివారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దుకాణంలోని నిల్వలు, రికార్డులు, రోజువారి విక్రయాలను పరిశీలించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ విజయ్ సిద్ధార్థ మాట్లాడుతూ దుకాణంలో సాధారణ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. నిర్వహకులు ఎలాంటి అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

**◆ చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు**



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలోగల బ్రహ్మి, కాళి, వైష్ణవి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

**◆ ఇసుక ట్రాక్టర్‌లు సీజ్**

వెల్దుర్తి(తూప్రాన్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నవత పేర్కొన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ హస్తాల్‌పూర్ శివారులో హల్దీవాగు నుండి తూప్రాన్ వైపుకు తీసుకెళుతుండగా పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. కానిస్టేబుల్ ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుక రావాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దీన్ తెలిపారు. ఆదివారం శేరిపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుక రావాణ చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను మైనింగ్ అధికారులకు బైండోవర్ చేసినట్లు వివరించారు. మండల పరిధిలోని గ్రామాలలో ఎవరైనా అనుమతులు లేకుండా మట్టిని, ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**◆ శివస్వాముల మహాపడి పూజ**

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని దారి దేవుని ఆలయం వద్ద ఆదివారం శివస్వాములు ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. అల్లాదుర్గ్‌కు చెందిన సదానంద స్వామి గురువు ఆధ్వర్యంలో మహాపడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ మండలాల నుండి సుమారు 400 మంది శివ స్వాములు హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**◆ కనుల పండువగా మల్లన్న కల్యాణం**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి పిల్లుట్ల గ్రామంలో మల్లికార్జునస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. జాతర మహోత్సవంలో భాగంగా రెండో రోజు యాదవ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అగ్నిగుండం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన బండారు సంతోష గంగాధర్ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో జాతర కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు, యాదవ సంఘం నేతలు తెలిపారు.

